ప్రజాశక్తి

శనివారం 4 ఫిబ్రవరి 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

భూపోరాటానికి నాయకత్వం వహించిన

ఇద్దరు నేతలు అరెస్టు

ప్రజాశక్తి-అద్దంకి, భట్టిప్రోలు

బాపట్ల జిల్లా, కొల్లూరు మండలం, చింతల్లంకలో దళితుల భూపోరాటానికి నాయకత్వం వహించిన కౌలు రైతుసంఘం జిల్లా నాయకుడు తోడేటి సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించినందుకు ఇప్పటికే మూడు సార్లు నోటీసులిచ్చామని, అయినా మళ్లీ భూమిలోకి ప్రవేశించడంతో అరెస్టు చేశామని పోలీసులు చెబుతున్నారు.

భూపోరాటానికి నాయకత్వం వహించిన నాయకులను అరెస్టు చేయడం అక్రమమని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య ఒక ప్రకటనలో ఖండించారు. పెత్తందారులు ఆర్‌సి భూములను అక్రమంగా ఆక్రమించుకుని అనుభవిస్తున్నా ఏమాత్రం స్పందించని అధికారులు పేదలపై కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. దళితులపై దాడి చేసిన పెత్తందారులను, అధికార పార్టీ నేతలను సంతృప్తి పరచడానికి అక్రమంగా అరెస్టు చేశారని విమర్శించారు. తక్షణమే కేసులను ఉపసంహరించుకోవాలని, దళితులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవా లని, ఆర్‌సి భూములను పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చింతల్లంక ఘటనపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి-భట్టిప్రోలు (కొల్లూరు)



విచారణ చేస్తున్న డిఎస్‌పి

కొల్లూరు మండలంలో చింతల్లంక, పెదలంక దళితులపై గాజుల్లంక, పెసర్లంక పెత్తందారులు చేసిన దాడిపై శుక్రవారం రేపల్లె డిఎస్‌పి టి.మురళీకృష్ణ విచారణ చేపట్టారు. దాడికి గురైన ముగ్గురు బాధితులతో పాటు మరో ఆరుగురు సాక్షులను విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, దళితులకు సంబంధించిన ఆర్‌సి భూముల వ్యవహారంలో రైతులు రావటం అనేది తప్పేనన్నారు. ▶ 2లో

'వెలిగొండ' నిర్వాసితుల్లో

గందరగోళాన్ని తొలగించేదెవరు?

- సర్వేలలో కుదించుకుపోతున్న అర్హుల సంఖ్య
- జాబితాలో పేరు లేకపోవడంపై ఆందోళన



ప్రజాశక్తి-మార్కాపురం

'పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు' నిర్వాసితులు అయోమయంలో పడ్డారు. తరచూ నిర్వహిస్తున్న సర్వేలతో నిర్వాసితుల సంఖ్య కుదించుకుపోవడమే అందుకు కారణం. అర్హులు సైతం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజిలో లేకపోవడం గందరగోళానికి గురి చేస్తోంది. ఈ గందరగోళానికి కారణం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మిగిలింది.. ప్రభుత్వం భారం తగ్గించుకునేందుకు సంఖ్య తగ్గిస్తోందా.? లేక కొందరు అధికారుల నిర్లక్ష్య ఫలితంగా జరుగుతోందా.? అనేది అంతుపట్టడం లేదు. నిర్వాసితుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించేది ఎవరంటూ..? బాధితులు ఎదురుచూస్తున్నారు.

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో 2006లో నిర్వహించారు. 2019 ఆగస్టు నాటికి 18 సంవత్సరాల వయసు కలిగిన వారినీ ప్యాకేజిలోకి తీసుకోవడం జరిగింది. దీంతో నిర్వాసితుల సంఖ్య 7,319కి చేరింది. వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నుంచి నిర్వాసితులను ఖాళీ చేయించే నాటికి 18 ఏళ్ల వయసు కలిగిన యువతీయువకులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి వర్తింపజేయాలని చట్టంలోనూ ఉంది. కానీ ఇక్కడి అధికారులు ఆ విధంగా చర్యలు తీసుకోకపోగా పదేపదే సర్వేలతో నిర్వాసితుల సంఖ్యను కుదించే పనిలో ఉన్నారు. ఇటీవల మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మాధవన్‌తో పాటు వెలిగొండ ప్రాజెక్టు భూ సేకరణ విభాగం స్పెషల్ కలెక్టర్ సరళావందనం విడుదల చేసిన నిర్వాసితుల జాబితాలో వేలల్లో అర్హుల పేర్లు తొలగిపోవడం గందరగోళానికి గురిచేసింది. 7,319 వరకు ఉన్న నిర్వాసితుల సంఖ్య 4,317కు దిగజారింది. వాస్తవంగా 7,319 మంది నిర్వాసితులతో పాటు ఇంకా గుర్తించాల్సిన నిర్వాసితులు ఉన్నారు. తగిన ధ్రువీకరణ పత్రాలు లేక అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సంఖ్య మరో వెయ్యికి పైగా పెరిగే అవకాశం ఉంది. అర్హులందరినీ గుర్తించాల్సింది పోయి.. అర్హత కలిగిన వారికి మొండిచేయి చూపడమేమిటని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. గ్రామ సభల ద్వారా నిర్వాసితులను ఎంపిక చేస్తే ▶ 2లో

ఉపాధ్యాయులపై తీవ్ర నిర్బంధం

- సంకల్పసభకు వెళ్లకుండా బెదిరింపులు
- నోటీసులు ఇచ్చి.. కదిలితే కేసులు పెడతామని హెచ్చరికలు



విజయవాడలో దీక్ష చేస్తూ.. అరెస్టయిన ప్రకాశం జిల్లా నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సిపిఎస్ రద్దు కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడ సమీపంలో తలపెట్టిన సంకల్పసభకు ఉపాధ్యాయులను వెళ్లనీయకుండా ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగించింది. సంకల్పసభకు అనుమతి ఇవ్వనందున ఎక్కడ పెట్టారనేదీ ఉపాధ్యాయులకు ఫోన్ల ద్వారా తెలియజేయాల్సిన పరిస్థితి వచ్చింది. శుక్రవారం నాడు విజయవాడ సమీపంలో జరిగే ఈ సభకు జిల్లా నుంచి భారీగా వెళ్లేందుకు ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు. కొందరు ముందురోజు రాత్రి నుంచే బయలుదేరారు. ప్రజాస్వామ్యయుతంగా సాగే ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు ఎవరూ వెళ్లకుండా పాలకులు చేయాల్సినవన్నీ చేశారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా నిర్బంధం మోపారని యుటిఎఫ్ నేతలు ధ్వజమెత్తుతున్నారు. సిపిఎస్ రద్దు చేస్తామని సిఎం జగన్ అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక అమలు చేస్తామంటూ కొన్నాళ్లు.. ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితుల్లో అమలు చేయలేమంటూ కొన్నాళ్లు కాలం గడిపారు. ఇప్పుడు సాధ్యం కాదంటే కాదనే వాదనకు వచ్చారు. దీని కోసం ఆందోళనలు చేస్తున్న ఉపాధ్యాయులపై నిర్బంధాలకు దిగుతున్నారు. సిపిఎస్ రద్దు పోరాటం తీవ్రరూపం దాల్చింది. రెండేళ్లుగా వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. విజయవాడలో జరిగిన భారీ ర్యాలీ దేశంలోనే చరిత్రకు దారితీసింది. కొన్ని రాష్ట్రాల్లో సిపిఎస్ అమలుకు నిర్ణయాలు తీసుకున్నారు. ఇక్కడ మాత్రం అణచివేతలకు దిగుతున్నారు. సిపిఎస్ రద్దు అనే ఏకైక డిమాండ్‌తోనే శుక్రవారం నాడు ఉపాధ్యాయులు సంకల్పసభ పెట్టారు. దీనికి ఉపాధ్యాయులను వెళ్లకుండా అడ్డుకునేందుకు పోలీసులు పెద్ద వ్యూహం అమలుచేశారు. ముందుగానే యుటిఎఫ్ నేతలకు నోటీసులు ఇచ్చారు. మండలాల్లో క్రియాశీలకంగా ఉన్న నేతలకు, టీచర్లకు కూడా నోటీసులిచ్చారు. ఇలా వెయ్యి మందికి పైగానే నోటీసులు అందుకున్నట్లు సమాచారం. ఇక ఉపాధ్యాయుల సెల్‌ఫోన్లపైనా నిఘా పెట్టారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రవిని సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగానే విజయవాడ వెళుతుండగా అడ్డుకున్నారు. కదలికలపైనా నిఘా పెంచారు. ఎక్కడికక్కడే కట్టడి చేసేందుకు పోలీసులు ప్రయత్నాలు చేశారు. ఇన్ని నిర్బంధాలు ప్రయోగించినా కొందరు విజయవాడ చేరుకున్నారు. ప్రభుత్వ చర్యలపై ఉపాధ్యాయులు భగ్గుమంటున్నారు. ఇప్పటికే ఉద్యోగుల్లో వ్యతిరేకత పెరుగుతోందని అంచనాలున్నా ప్రభుత్వం మాత్రం తీరుమార్చుకోవడం లేదని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు విమర్శిస్తున్నారు.

సంకల్ప దీక్షలో జిల్లా ఉపాధ్యాయులు

పొదిలి: విజయవాడ, గన్నవరం సమీపంలోని ధర్మస్థలి వద్ద ఏర్పాటుచేసిన సంకల్ప దీక్షలో జిల్లా నుంచి పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దీక్షను భగ్నం చేసిన పోలీసులు ఉపాధ్యాయులను, నాయకులను అరెస్టు చేసి.. వీరవల్లి పోలీస్‌స్టేషనుకు తరలించారు. స్టేషన్లో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన సంకల్ప దీక్షను మాజీ పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఎస్ ప్రకాశం జిల్లా కన్వీనర్ షేక్ అబ్దుల్ హై, రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడారు. యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావును అరెస్టు చేసి.. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. అరెస్ట్ అయిన వారిలో కొనకనమిట్ల ప్రధాన కార్యదర్శి గోనే శ్రీనివాసులు, సిపిఎస్ సబ్ కమిటీ మెంబర్ పుత్తూరు రమేష్ ఉన్నారు.

ఎక్కడి సమస్యలు

అక్కడే పరిష్కరించాలి

మంత్రి సురేష్



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి- త్రిపురాంతకం

ప్రజలకు సంబంధించి ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం త్రిపురాంతకం మండలంలోని మేడపి గ్రామంలోని ఎస్టీ కాలనీలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సురేష్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఆయన మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కోవిడ్ కష్టకాలంలోనూ ఏ ఒక్క పథకమూ ఆగలేదన్నారు. ఇదే ప్రభుత్వ చిత్త శుద్ధి, నిబద్ధతకు నిదర్శనమన్నారు. కుల, మత, రాజకీయపార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు నెలకొన్నాయన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేయాలని చెప్పారు. ఇదే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేలా దీవించాలని ప్రజలను కోరారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

త్రిపురాంతకం మండలంలోని కొత్త అన్న సముద్రంలో నూతనంగా రూ.కోటి 67 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మకాం జానపాల్, ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, డిఎం అండ్ హెచ్ఓ రాజ్యలక్ష్మి, రాష్ట్ర గ్రంథాలయం ఉపాధ్యక్షులు రాచగొర్ల పిచ్చయ్య యాదవ్, మండల వైసీపీ కన్వీనర్ పొలిరెడ్డి, కో కన్వీనర్ ఎల్లారెడ్డి, మండల ఉపాధ్యక్షులు రిబ్కా ప్రసాద్, అన్న సముద్రం సర్పంచి వంకాయలపాటి వెంకట రమణ, ఉప సర్పంచ్ వైసీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గందరగోళాన్ని తొలగించేదెవరు?

(మొదటిపేజీ తరువాయి)

ఈ గందరగోళం ఉండదని వారి అభిప్రాయం. ఎక్కడో కార్యాలయాల్లో కూర్చొని.. ఎవరో చెప్పిన విధంగా జాబితా తయారుచేయడం సరికాదని నిర్వాసితులు పేర్కొంటున్నారు. అర్హత కలిగిన నిర్వాసితుల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా గ్రామాలు ఖాళీ చేయబోమని నిర్వాసితులు హెచ్చరిస్తున్నారు. అందరికీ న్యాయం జరిగిన తరువాతనే ఖాళీ చేస్తామని గట్టిగా చెబుతున్నారు. ప్యాకేజి రాక... ముంపు గ్రామాల్లో ఉండే పరిస్థితి లేక.. ఖాళీ చేసి ఎక్కడ జీవనం సాగించాలని ఆర్అండ్ఆర్ ప్యాకేజిలో పేరు లేని నిర్వాసితులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఈ విధంగా నిర్వాసిత గ్రామాల్లో 200 నుంచి 300 మంది వరకు అర్హత ఉన్న వారు ప్యాకేజికి దూరం కావడం బాధాకరమే.!

– మార్కాపురం మండలంలోని గొట్టిపడియ గ్రామంలో బోగెం వెంకటచెన్నయ్య అనే వ్యక్తి అదే గ్రామంలో జన్మించాడు. అతని జీవనాధారం మేకలు మేపుకోవడమే. అతనితో పాటు తమ్ముడు చిన్న చెన్నయ్య కూడా మేకల కాపరి. ఇద్దరికీ చదువు లేదు. నిర్వాసితుడిగా అన్ని అర్హతలూ ఉన్నాయి. 2006 తరువాత విడుదల చేసిన గజిట్‌లో కూడా వారు ఉన్నారు. ప్రస్తుతం నిర్వాసితుల సంఖ్య కుదింపులో ఆ ఇద్దరి పేర్లూ లేకుండా పోయాయి. దీంతో వారు అయోమయంలో పడ్డారు. భార్య, పిల్లలను వెంటబెట్టుకుని గ్రామం ఖాళీ చేస్తే తమ పరిస్థితి ఏమిటని తలచుకోని బోరున విలపిస్తున్నారు. సెంటు భూమి లేదు... నివాసం ఉండేందుకు ఇల్లు ఉండదు.... కుటుంబం అంతా వీధిన పడాల్సి వస్తోందని, అధికారులు, ప్రజాప్రతినిధులు తమకు న్యాయం చేయాలని బోగెం వెంకటచెన్నయ్యతో పాటు సోదరుడు చిన్న చెన్నయ్య వేడుకుంటున్నారు.

పెద్దారవీడు మండలంలోని సుంకేసుల గ్రామంలోనూ ఇలాంటి పరిస్థితులే ఎదురవుతున్నాయి. ఆ గ్రామానికి చెందిన భీమవరపు లక్ష్మయ్య అనే వృద్ధుడు అర్హత కలిగినవాడే. అదే గ్రామంలో వయో భారంతో జీవనం సాగిస్తున్నాడు. 2006లో అధికారుల సర్వేలో పలకపట్టి దించిన ఫొటోలో కూడా ఉన్నాడు. కానీ కొత్తగా తయారు చేసిన జాబితాలో ఆయన పేరు లేదు. ఇప్పుడు ప్యాకేజి రాక... ఇంటి స్థలం రాకపోతే... అవసాన దశలో తన జీవనం కష్టమని, న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు.

అర్హులందరికీ ప్యాకేజి అందిస్తేనే..

నిర్వాసిత పోరాట సంఘం కన్వీనర్ గాలి వెంకటరామిరెడ్డి



పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా సహించేది లేదని వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసిత పోరాట సంఘం కన్వీనర్ గాలి వెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ముంపు గ్రామాల్లో అర్హత కలిగిన ఏ ఒక్కరికి ప్యాకేజి అందకపోయినా గ్రామాలు ఖాళీ చేసేది లేదన్నారు. వెలిగొండ రాక కోసం సర్వం త్యాగం చేసిన వారికి వెలిగొండ శాపం కాకూడదన్నారు. లక్షలాది మంది కోసం త్యాగం చేసిన నిర్వాసితులంతా సంతోషంగా ఉండేలా ప్రభుత్వం సాగనంపాలే గానీ... నిర్వాసితుల సంఖ్యను కుదించి... కొందరికి ప్యాకేజి ఇచ్చి చేతులు దులుపుకోవాలనుకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. వెలిగొండ నిర్వాసితులకు జరుగుతున్న అన్యాయంపై త్వరలో మరో పోరాటాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

శివాలయం ట్రస్టుబోర్డు ఛైర్మన్‌గా యక్కలి



పొదిలి : పొదిలి శ్రీ పార్వతీసమేత నిర్మామహేశ్వర దేవస్థానం ట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా ఆర్య వైశ్య సంఘం నాయకులు యక్కలి శేషగిరిరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు తనకు ఉత్తర్వులు అందినట్లు శేషగిరిరావు తెలిపారు. దేవాదాయ శాఖ కమిషనర్ డాక్టర్ ఎం.హరిజవహర్ లాల్ ఆదేశాల మేరకు యక్కలి శేషగిరిరావు ఛైర్మన్‌గా, కోలగట్ల అంజిరెడ్డి, గొలమారి నాగమణి, పులుకూరి నాగేశ్వరరావు, మునగాల వెంకట లక్ష్మి సుజాత, పావులూరి నాగమణి, గంజి సుబ్బారావు, అర్చకులు సుబ్బనరసయ్య కార్యవర్గ సభ్యులు నియమిస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గిద్దలూరు

పశు కాపరిపై దాడి చేసిన ఫారెస్టు సెక్షన్ అధికారి జమాల్ పై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని జయరాంపురం గ్రామస్తులు డిమాండ్ చేశారు. జమాల్ ఆగడాలు రోజు రోజుకు ఎక్కువైపోతున్నాయని తెలిపారు. తప్పు చేసిన చర్యలు తీసుకోకుండా వారి దగ్గర లంచాలు తీసుకొని పశు కాపరులపై దాడి చేస్తున్నట్లు వారు తెలిపారు. జయరాంపురం గ్రామ సమీపంలోని ఓ పొలంలో విద్యుత్ వైర్ల కారణంగా అటవీ జంతువు (అడవి పంది) శుక్రవారం మృతిచెందినట్లు తెలిపారు. అయితే దాన్ని సాకు చూపి ఫారెస్ట్ సెక్షన్ అధికారి జమాల్ పశు కాపరి చిత్తలూరి తిరుపతయ్యపై దాడి చేశాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు పశుకాపరి చిత్తలూరి తిరుపతయ్యను కొట్టే అధికారం మీకు ఇచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీలోని చెట్లను కొందరు అక్రమంగా నరికి బహిరంగంగా మార్కెట్‌లో విక్రయిస్తుంటే మీరేమి చేస్తున్నారంటూ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్‌తో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. దీంతో జమాల్ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. పశుకాపరిపై అన్యాయంగా దాడి చేసిన జమాల్ పై వారు డిమాండ్ చేశారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : వరికూటి

ప్రజాశక్తి-కొండపి

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని ముప్పవరం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎంపిటిసి మాదాల మాధురి, వైసిపి నాయకులు మధు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు గడపగడపూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అదేవిధంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, వైసిపి మండల కన్వీనర్ గోగినేని వెంకటేశ్వర్లు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో సమీక్ష

అర్ధవీడు : హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీ లబ్ధిదారులతో ఎంపిడిఒ వీరభద్రాచారి అధ్యక్షతన జగనన్నకాలనీ లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి, తహశీల్దారు కె.రవిబాబు మాట్లాడుతూ జగనన్నకాలనీ లబ్ధిదారులందరూ త్వరితగతిన గహ నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రామకష్ణ, ఎపిఎఒ రామయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వర్క్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవనోపాధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మద్దిపాడు

మత్స్యకారులకు జీవోపాధికి ముఖ్య మంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని మల్లవరం గుండ్లకమ్మ జలాశయంలోకి 11.57 లక్షల చేప పిల్లలను శుక్రవారం వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ గుండ్లకమ్మ జలశయంలో అనుమతి ఉన్న మత్స్యకారులు మాత్రమే చేపలను వేటాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, జడ్‌పిటిసి భాగ్యలక్ష్మి, అన్నంగి సర్పంచిలోకేశ్వరి అనివాష్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మద్దిపాడు

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలలో విస్తతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సుధాకర్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని మల్లవరం గ్రామంలోని విజయభవన్‌లో సచివాయాల కన్వీనర్లు, గృహ సారథులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేనన్ని పథకాలు మన రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పారావు, బత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **కొండపి :** ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల కృషి చేయాలని వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపాడు. స్థానిక కామేపల్లి రోడ్డులోనున్న సీతారామ కల్యాణ మండపంలో వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. చెప్పారు. ప్రతి గృహసారథి ప్రతి పక్ష పార్టీకి చెందిన నాలుగు గృహాలను దత్తతు తీసుకొని అధికార పార్టీకి ఓట్లు వేసే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గోగినేని వెంకటేశ్వర్లు, నాయకులు జి.మురళి, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

చింతల్లంక ఘటనపై డిఎస్‌పి విచారణ

(మొదటిపేజీ తరువాయి)

దళితులు కూడా ఆ భూముల్లోకి వెళ్లవద్దని అధికారులు నోటీసులు ఇచ్చినా భూముల్లోకి వెళ్లటం సరైన పద్ధతి కాదని, ఈ వ్యవహారంలో ఇరువురిపై కేసులు నమోదు చేశామన్నారు. దళిత బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైతులపైన, అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భూ ఆక్రమణదారులపైన కేసులు నమోదయ్యాయన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసు కావటం వల్ల సమగ్రంగా విచారించి.. నమోదు చేసి.. అరెస్టులు చేపట్టాల్సి ఉందన్నారు. రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి.. చర్యలు చేపడతామన్నారు. ఈయన వెంట వేమూరు సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రాజీవ్‌కుమార్ ఉన్నారు.

రీసర్వే పరిశీలన

వెలిగండ్ల : మండల పరిధిలోని మొగుళ్ళూరు గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వేను జిల్లా సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ ఆఫీసర్ కె.గౌస్‌బాసా శుక్రవారం పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో భూముల రీ సర్వే పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన గ్రౌండ్ ట్రూతింగ్ రికార్డ్, నోటీసులు పరిశీలించి వెక్టరైజేషన్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు నాగార్జునరెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు రమేష్, మండల డిప్యూటీ సర్వేయర్ బ్రహ్మానందరెడ్డి, విఆర్ఒ కాశిం, గ్రామ సర్వేయర్లు శివనారాయణ,శేషగిరిరావు, బి.శ్రీరాములు, సుబ్బారాయుడు పాల్గొన్నారు

లోయలోకి దూసుకెళ్లిన లారీ

- విహార యాత్రకు వచ్చిన ఇద్దరు యువకులు దుర్మరణం
- డ్రైవర్ సహా ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో పాములేరు గ్రామ సమీపంలో మలుపు వద్ద పన్నెండు టైర్ల భారీ లారీ అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో విహార యాత్రకు వచ్చిన ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు యువకులకు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు, మృతుల స్నేహితుల తెలిపిన వివరాలు ప్రకారం..

ప్రకాశం జిల్లా దర్శి గ్రామానికి చెందిన ఆరు గురు స్నేహితులు గురువారం పాపికొండలు విహార యాత్ర కు వెళ్లారు. అనంతరం బస్సులో మారేడుమిల్లికి వచ్చారు. రాత్రి మారేడుమిల్లి క్యాంపింగ్ టెంట్ రిసార్ట్‌లో బస చేశారు. అనంతరం శుక్రవారం బస్సుతో జలతరంగిణి జలపాతానికి చేరుకుని, జలపాతాన్ని సందర్శించి అక్కడ నుంచి అమృత ధార జలపాతానికి వెళ్లారు. అక్కడ నుంచి మారేడుమిల్లి తిరిగి రావడానికి వేచి చూస్తున్నారు. ఈ సమయంలో పౌర సరఫరాల బియ్యాన్ని చింతూరులో దింపి తిరిగి రాజమహేంద్రవరం వస్తున్న 12 టైర్ల భారీ లారీ ఆ మార్గంలో వస్తుండగా, దానిని ఆపి ఆరుగురు యువకులు ఎక్కారు.


ప్రమాదానికి గురైన లారీ

పాములేరు గ్రామ సమీపం వద్ద మలుపులో ఈ లారీ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్లను ఢీకొని సుమారు 80 అడుగుల లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో విహార యాత్రకు వచ్చిన పి నారాయణరెడ్డి(32), జి సురేష్(23) అక్కడికక్కడే మృతి చెందారు. నాగిరెడ్డి, హర్షవర్ధన రెడ్డి, పెద్దమాతా సుబ్బారెడ్డి, స్వామి, లారీ డ్రైవర్ గాయపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్ ద్వారా రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మారేడుమిల్లి సీఐ శ్రీనివాసరావు, మారేడుమిల్లి, గుర్తేడు ఎస్ఐలు రాము,



టిసి నారాయణరెడ్డి, విద్యార్థి సురేష్‌రెడ్డి (ఫైల్)

జ్వాల సాగర్ సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకొని స్థానిక ప్రజల సహకారంతో సహాయక చర్యలు చేపట్టారు. నాగ సురేష్ మృత దేహం లారీ ఎదుట భాగం కింద మట్టిలో కూరుకుపోయింది. లోయలో పడిపో వడంతో వెలికితీత చర్యలు చేపట్టారు. మృతులు పిచ్చెల నారాయణరెడ్డి ఒడిశా రాష్ట్రం రామ్‌ంగపూర్లో రైల్వే స్టేషన్లో టీసీగా పనిచేస్తున్నారు. నాగ సురేష్ ఎంసీఏ చదువుతున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మారేడుమిల్లి పోలీసులు తెలిపారు.

చెరువులో పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి-కారంచేడు


మాహిన్ (ఫైల్)

మండలంలోని కారంచేడు గ్రామానికి చెందిన పఠాన్ మాహిన్(2) అనే చిన్నారి శుక్రవారం ఉదయం ఇంటి ఎదురుగా ఉన్న చెరువులో పడి మృతి చెందింది. కారంచేడు గ్రామానికి చెందిన మటన్ కాసిం, అఫ్రోజ్ భార్యాభర్తలు. బేల్దారి, ముఠా కార్మికులుగా వీరు పనిచేస్తుంటారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. శుక్రవారం ఉదయం ఆడుకుంటానికి బయటికి వచ్చిన చిన్నారి మహిన్(2) ఇంటి ఎదురుగా ఉన్న చెరువులో మునిగిపోయింది. చిన్నారి కనిపించక ఏమైందో ఊరు మొత్తం వెతుకుతున్న వీరికి మధ్యాహ్నానికి చిన్నారి మృతదేహం చెరువులో కనిపించింది. దీంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-చీరాల

టెలికం సంస్థ రిలయన్స్ జియో చీరాలలో కొత్తగా 5జీ సేవలను ప్రారంభించింది. ఈ సేవలకు సంబంధించి శుక్రవారం సిబ్బంది పట్టణ ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రధాన కూడలిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కొత్తగా తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 31 నగరాలలో 5జీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం 225 కేంద్రాల్లో కస్టమర్లు జియో 5జీ సర్వీసులను వినియోగిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా చీరాలలో జియో బృందం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మేనేజర్ సాంబాశివరావు, డిప్యూటీ మేనేజర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.


వ్యవసాయ అధికారులు సీజ్ చేసిన ఎరువులు

ఎరువుల దుకాణం సీజ్

ప్రజాశక్తి-అద్దంకి

గుంటూరు విజిలెన్స్ అధికారులు మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాలపై తనిఖీ నిర్వహించారు. నాగేశ్వర ట్రేడర్ దుకాణంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. రూ.73,236 రూపాయల విలువగల ఎరువులు సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. వెంకటేశ్వర ట్రేడర్ దుకాణంలో ఫారం ఒ లు, లైసెన్స్‌లో నమోదు చేసుకోనందున రూ.1,47,000 విలువ గల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేశారు. తనిఖీలలో విజిలెన్స్ సిఐ శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి-అద్దంకి

స్థానిక ప్రకాశం బాలికల హైస్కూల్‌లో 150 మంది విద్యార్థినులకు కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో, హైదరాబాదులోని మన ఫ్రెండ్షిప్ క్లబ్ హైదరాబాదు లెజెండ్స్ సభ్యుల సమక్షంలో శుక్రవారం జరిగింది. సందిరెడ్డి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు చిన్నప్పటి నుంచి మంచి ఆహారపు అలవాట్లు పాటిస్తూ కంటి జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పివి రాఘవరావు మాట్లాడుతూ పంపిణీ చేసిన కంటి అద్దాలు సక్రమంగా వినియోగించుకొని చదువులో ఉన్నతంగా రాణించాలని చెప్పారు. పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు ఆహారంలో ఏ విటమిన్ కలిగిన ఆహారం, గుడ్లు, ఆకుకూరలు తీసుకోవాలని చెప్పారు. వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య) మాట్లాడుతూ పలు రోటరీ సేవలు వివరించారు. కళ్ల జోళ్లుగొంగటి సంజీవరెడ్డి, బెల్లంకొండ అంకమ్మ రావు స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ లెజెండ్స్ క్లబ్ తరపున అధ్యక్షులు మోహన వంశీ, సెక్రటరీ చంద్ర కాశీరాజు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజారామ్, సభ్యులు సాయి హాజరయ్యారు. అద్దంకి క్లబ్ తరపున ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, సభ్యులు దేవపాలన, చంద్రమౌళి, నర్రా శ్రీలక్ష్మి, కొల్లా భువనేశ్వరి, షేక్ మహమ్మద్ రఫీ, దివాకర్ దత్తు, మలాది శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, కె నాగయ్య, షేక్ అంజాద్ బాషా, కాకర్ల వెంకటేశ్వర్లు, గురుశేఖర్, చుండూరి మురళీ సుధాకరరావు, అద్దంకి లెవీ ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.




విద్యార్థినులకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి

వెలిగండ్లలో సైన్స్‌ఫేర్

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల హైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఫేర్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి, ఎంపిపి రామన మహాలక్ష్మీ ప్రారంభించారు. అనంతరం జడ్‌పిటిసి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సైన్స్ ద్వారా విద్యార్థులకు జ్ఞానంతో పాటు విజ్ఞానం పెరుగుతుందన్నారు. సైన్స్ ఫేర్ సందర్భంగా మండల పరిధిలోని వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు మొత్తం 80 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిప్యూటీ డిఇఒ చంద్రమల్లేశ్వరిరావు, స్పెషల్ ఆఫీసర్ నాయక్, ఎంఇఒ దాసు ప్రసాద్, ఎంపిడిఒ సుకుమార్, మాజీ జడ్‌పిటిసి రామన తిరుపతి, సర్పంచి సురేష్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అంజనీదేవి, గురుప్రసాద్, కొండమ్మ, సైకం శ్రీనివాసరెడ్డి, సిఎంఒ రాజల కొండారెడ్డి, వెలిగండ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి, వివిధ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వధూవరులతో ఎమ్మెల్యే డోలా

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం

ప్రజాశక్తి-శింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని విద్యా నగర్‌లో టిడిపి నాయకుడు, కలికివాయి మాజీ సర్పంచి మందలపు గాంధీ చౌదరి సోదరుడి కుమారుడి వివాహ వేడుకలు, సత్యనారాయణ వ్రతం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనీయ స్వామి, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త బెల్లం కోటయ్య పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

సిఐటియు మహాసభలు జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-సిఎస్‌పురం: ఈ నెల 5న నిర్వహిస్తున్న సిఐటియు మండల మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ గురువారం బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సన్నపురెడ్డి తిరుపతిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. సిఐటియు మండల అధ్యక్షుడు డి తిరుపతయ్య, నాయకులు బి ఏసురత్నం, ఎం శ్రీను, ఆర్ కరిముల్లా, బిజి రాజు, రత్నం పాల్గొన్నారు.

పీపుల్స్ ట్రామా హాస్పిటల్ ప్రారంభం

ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌చార్జి కరణం వెంకటేష్

అందరికీ అందుబాటులో వైద్య సేవలు: డాక్టర్ షేక్ నాగూర్‌బాబు

ప్రజాశక్తి-చీరాల

వైద్యరంగంలో అత్యధిక వైద్య సేవలను చీరాల ప్రాంతంలోనే ప్రప్రథమంగా పీపుల్స్ ట్రామా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా ఆధునిక వైద్యాన్ని అందిస్తున్న తమ పీపుల్స్ ట్రామా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ షేక్ నాగూర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నారాయణ కాలేజీ పక్కన ఏర్పాటు చేసిన పీపుల్స్ ట్రామా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. చీరాల ప్రాంత ప్రజలకు అన్ని రకాల వైద్య సదుపాయాలను పీపుల్స్ ట్రామా మల్టీస్పెషాలిటీ హాస్పటల్ నిర్వాహకులు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ నిర్వాహకులు మాట్లాడుతూ విజయవాడ, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు అత్యవసర కేసులను చీరాల ప్రాంతంలోనే అందుబాటులోకి తీసుకువచ్చి వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. స్థానిక హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ వెనుక నారాయణ కాలేజీ పక్కన పీపుల్స్ ట్రామా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించామని డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ నాగూర్ బాషా అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి రక్షణ కవచంగా, ప్రజలకు మెరుగైన కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు ఈ వైద్యశాలను స్థాపించామని పేర్కొన్నారు. చీరాల పరిసర ప్రాంతాల ప్రజలకు అతితక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పీపుల్స్ ట్రామా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో వైద్య సేవలు అందిస్తామని, సూదుర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా అధునాతనమైన వైద్యసౌకర్యాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అపాయింట్మెంట్ కోసం 8019600690 నెంబరులో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ కోర్నియల్, జె కాశీ విశ్వనాథం, మేనేజింగ్ డైరెక్టర్ దావుద్ వలీ, నాగూర్ బాబు తదితరులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న హాస్పటల్ ప్రతినిధులు

విశ్వనాథ్ సంతాప సభ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

తెలుగు చలనచిత్ర జగత్తులో కళాతపస్వి కే విశ్వనాథ్ ఒక కొత్త ప్రభంజనాన్ని సృష్టించారని సాహితీ భారతి కార్యదర్శి కస్తూరి శ్రీనివాస్ కొనియాడారు. దాదాపు 60 సినిమాలకు దర్శకత్వం వహించారని, ప్రతి సినిమాలో ఏదో ఒక ప్రత్యేకతను ఒక సందేశాన్ని తెలియజేసేవారని పేర్కొన్నారు. శుక్రవారం సాహితీ భారతి ఆధ్వర్యంలో విశ్వనాథ్ సంతాప సభ జరిగింది. సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ విశ్వనాథ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, రఘుపతి వెంకయ్య అవార్డు, పద్మశ్రీ అవార్డుతో బాటు ఐదు జాతీయ అవార్డులు, 7 నంది అవార్డులు, 10 ఫిలింఫేర్ అవార్డులు లభించాయని అన్నారు.

సమస్యలను కళల ద్వారా చెప్పేందుకే శిక్షణ

ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్



ప్రజాశక్తి-రేపల్లె

వామపక్ష భావజాలం కలిగి అనేక పోరాటాలకు స్ఫూర్తినిచ్చే నాయకులు ఎదిగిన రేపల్లెలో ప్రజానాట్యమండలి రాష్ట్ర శిక్షణా తరగతులు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్ కుమార్ తెలిపారు. ఈ నెల 4,5,6 తేదీలలో మైనేని సీతారామయ్య కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి 200 మంది కళాకారులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పెనుమూడి వారధి పక్కనే ఉన్న రేపల్లెలో మొట్టమొదటిసారి జరుగుతున్న రాష్ట్ర శిక్షణా తరగతుల జయప్రదానికి తోడ్పాటునివ్వాలని కోరారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ కళ ప్రజల కోసం.. కళ ప్రగతి కోసం.. లక్ష్యంతో ఇండియన్ పీపుల్స్ థియేటర్స్ అసోసియేషన్(ఇప్టా) స్ఫూర్తితో ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పడిన ప్రజానాట్యమండలి తెలుగువారి సాంస్కృతిక వికాసం కోసం అనేక కళా రూపాలను సృష్టించిందని పేర్కొన్నారు. నాటి నుంచి నేటి వరకు తెలుగు రంగస్థలంపై అనేక ప్రయోగాలు చేసి ప్రజలను చైతన్యవంతం చేసింది, చేస్తోంది అన్నారు. కొన్ని వందల జానపద గీతాలను వెలికితీసి ప్రజల గొంతులో నాదమై పలికిందన్నారు. పాటపై అనేక ప్రయోగాలు చేసిందని తెలిపారు. ఆంధ్ర దేశంలో జరిగిన ప్రతి ప్రజా పోరాటంలో ప్రజానాట్యమండలి ఉందన్నారు. అక్షరాస్యతా ఉద్యమం, సారా వ్యతిరేక ఉద్యమం, కూలిరేట్ల ఉద్యమం, గిట్టుబాటు ధర ఉద్యమం, సబ్ ప్లాన్ ఉద్యమం లాంటి అనేక ఉద్యమాలకు ఉత్తేజం ప్రేరణ ఇచ్చిందని అన్నారు. సమాజ మార్పు కోసం నిర్వహిస్తున్న పోరాటాల్లో కళల పాత్ర కీలకమైనదని తెలిపారు. చరిత్రలో జరిగిన పోరాటాల్లో అనేక అనుభవాలు ఉన్నాయని పేర్కొన్నారు. కళ ప్రజల కోసం, కళ ప్రగతి కోసం లక్ష్యంతో ప్రజా నాట్యమండలి ఏర్పడినట్లు ఆయన తెలిపారు. ఉద్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రజానాట్యమండలి కృషి చేస్తోందని అన్నారు. ఆంధ్రరాష్ట్రంలో జరిగిన అనేక ప్రజాపోరాటాలో ప్రజా నాట్యమండలి ముందున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యలు కళారూపాల ద్వారా ప్రజలకు త్వరగా చేరతాయని అన్నారు.



సిడిపిఒకు ధర్నా నోటీసు ఇస్తున్న అంగన్‌వాడీ నాయకులు

6న అంగన్‌వాడీల ధర్నాకు తరలిరండి

ప్రజాశక్తి-రేపల్లె

అంగన్‌వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 6వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు తరలిరావాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 6వ తేదీ జరిగే ధర్నాను తెలియపరిస్తూ నోటీసు రేపల్లె ప్రాజెక్టు ఆఫీసులో ధర్నా నోటీసు సీడీపీఓ మాణిక్యంకు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యాలు, ప్రభుత్వ భవనాలు లేక కొన్ని సెంటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే మరో పక్కన రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలు కూడా ఫేస్ యాప్ హాజరు వేయాలి అని ఒత్తిడి చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు నిర్మల జోతి, జయప్రద, విజయలక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.



సత్తాచాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రజనికుమారి, పిఇటి మమత

ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-వేటపాలెం

రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో స్థానిక బిసి గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపాల్ బి రజని కుమారి తెలిపారు. శుక్రవారం ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీ కుమారి మాట్లాడుతూ సింహాచలంలో రాష్ట్రస్థాయి బిసి గురుకుల పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారన్నారు. క్యారమ్స్ పోటీల్లో పదో తరగతి విద్యార్థులు పి ఎల్లయ్య, కె మోహనసాయి ద్వితీయ స్థానం సాధించారు. హైజంప్ విభాగంలో 9వ తరగతి విద్యార్థి కె.రామకౌషిక్ తృతీయ స్థానం సాధించారు. రాష్ట్రస్థాయిలో జరగబోయే ఎస్‌జిఎఫ్ కబడ్డీ, వాలీబాల్ ఆటల పోటీలకు విద్యార్థులు టి అనీల్, కె శివ శంకర్, బి కాటంరాజు, కె హేమంత్‌కృష్ణ, సిహెచ్ వంశీకృష్ణ ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రజనికుమారి అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఇటి కె మమత ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

గర్భిణులు, బాలింతల పట్ల ఆరోగ్య సిబ్బంది అంగన్‌వాడీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపిపి డివి లలితకుమారి పేర్కొన్నారు. మండలంలోని ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యుల సూచనల మేరకు ఆరోగ్య నియమాలు పాటించాలని కోరారు. వైద్యులు శ్రీనివాసరావు మాట్లాడుతూ 10 నుంచి 19 ఏళ్ల లోపు బాలికలలో అనామిక్ ఉన్న వారికి ఐరన్ మాత్రలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి ఉదయ్ భాస్కరి, గ్రామ సర్పంచ్ ఎం కోటేశ్వరారావు, ఎంపిటిసి మురుగుడు శ్రీనివాసరావు, హెచ్ఎం కె లక్ష్మీనారాయణ, సిహెచ్ఓ మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



నాగులపాలెంలో చెరువు పూడిక తీత పనులు పరిశీలిస్తున్న పిడి శంకర్ నాయక్

'పర్చూరు'లో డ్వామా పీడీ పర్యటన

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలం నాగులపాలెంలో డ్వామా పిడి వై శంకర్‌నాయక్ పర్యటించారు. కాలువ పూడిక తీత పనులను పిడి పరిశీలించారు. టెక్నికల్ అసిస్టెంట్‌లతో మాట్లాడారు. పని విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని, నిర్ణీత సమయంలో పనిలోకి రావాలని, కూలీల పని కొలతల విషయంలో పారదర్శకంగా ఉండాలని అన్నారు. జరుగుతున్న పనులపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కూలీలతో మాట్లాడారు. అనంతరం మండలంలోని నూతలపాడు వర్మీకంపోస్టు కేంద్రాన్ని ఎంపిడిఒ జి లక్ష్మీదేవితో కలిసి పరిశీలించారు. రైతులు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వర్మీకంపోస్టుకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఆయన వెంట ఏపిఓ బుల్లియ్య, నూతలపాడు సర్పంచ్ కాకర్లమూడి చిన్నయ్య, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

రేపు అమరవీరుల స్మారక సభ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఈ నెల 5వ తేదీన సాయంత్రం 4 గంటలకు రేపల్లె నెహ్రూ బొమ్మ సెంటర్లో అమర వీరుల స్మారక సభ జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి జి సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి రమాదేవి, బాపట్ల జిల్లా కార్యదర్శి గంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్, రేపల్లె మండల కార్యదర్శి మణిలాల్ తదితరులు పాల్గొంటారని, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పౌష్టికాహార లోపాన్ని నివారించేలా చర్యలు

ప్రజాశక్తి-పంగులూరు



మాట్లాడుతున్న ఎస్‌బిసిసి జిల్లా కోఆర్డినేటర్ జి చైతన్య

పౌష్టికాహార లోపాన్ని నియంత్రించేందుకు మహిళా పోలీసులు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఎస్‌బిసిసి జిల్లా కోఆర్డినేటర్ జి చైతన్య అన్నారు. పంగులూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, కిశోర బాలికలు మొదలైన వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాను వచ్చానని చెప్పారు. గర్భిణులలో ఉండే పోషకాహారం లోపాన్ని గుర్తించామని, అందుకోసమే కొన్ని చర్యలు తీసుకుంటున్నామని చైతన్య చెప్పారు. అంగన్‌వాడీలకు 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలను కేటాయించినట్లు తెలిపారు. మహిళా పోలీసులకు 6 నుంచి 12 సంవత్సరాల పిల్లలను కేటాయించినట్లు తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్లకు 13 నుంచి 19 సంవత్సరాల పిల్లల కేటాయించామన్నారు. ఏఎన్ఎంలకు బాలింతలను, గర్భిణులను కేటాయించామన్నారు. వీరందరూ వారికి కేటాయించినవారితో ముఖాముఖిగా మాట్లాడాలని, పౌష్టికాహారం లోపాన్ని నివారించడానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలనేది వారికి వివరించాలని సూచించారు. బాలింతలు, గర్భిణులకు సూచనలు చేసేటప్పుడు వారి కేర్ టేకర్లయిన తల్లి, తండ్రి, భర్తలతో కూడా మాట్లాడాలని, తగు సూచనలు చేయాలని తెలిపారు. ఆరు నుంచి 19 సంవత్సరాల పిల్లలకు పౌష్టికాహార లోపం ఎక్కువగా ఉందని గుర్తించామని, అందుకు అనుగుణంగా వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు ప్రతి ఇంటికి వెళ్లి పౌష్టికాహారం ఎక్కువగా లభ్యమయ్యే వాటి గురించి వివరించాలని తెలిపారు. ఉదయం 9 గంటల లోపు సాయంత్రం 6 గంటల తర్వాత ఎక్కువమంది ఇళ్ళ వద్ద ఉంటారు కాబట్టి ఆ సమయంలో ఇంటికి వెళ్లి వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని తెలిపారు.0 నుండి బాలింత వరకూ సంపూర్ణ ఆరోగ్య జిల్లాగా బాపట్ల చేయటమే జిల్లా కలెక్టర్ ఉద్దేశమని, అందుకోసం ప్రతీ శు క్రవారం సంభాషణ సమావేశం , ప్రతీ మండలంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జునరావు, ప్రాథమిక వైద్యులు డాక్టర్ శివ చెన్నయ్య ,సిపిడిఓ కష్ణకుమారి ,సిహెచ్ఓ భారతి ,హెల్త్ డిక్టేటర్ అనురాధ ,మహిళా పోలీసులు ,అంగన్వాడీ కార్యకర్తలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రహదారి వివాదంపై డిఎల్‌పిఒ విచారణ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం గ్రామంలో ఎన్నో ఏళ్ళుగా పరిష్కారం కాని దళితవాడ సిసి రహదారి వివాదంపై గురువారం రాత్రి గ్రామపెద్దల సమక్షంలో పరిష్కారానికి సిద్ధపడినా ఇరువర్గాల పట్టుదలతో పరిష్కారం కాలేదు. దళితవాడ కమ్యూనల్ స్థలాన్ని ఆనుకొని ఉన్న మూడు కుటుంబాల వారికి నిర్దేశిత రహదారి మార్గం లేదు. కమ్యూనల్ స్థలంలో నుంచి నడవాల్సి వస్తుంది. దీని దృష్ట్యా రహదారి ఏర్పాటు చెయ్యాలని ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నారు. కానీ సంఘ ఉమ్మడి స్థలం కావటంతో కొందరు రహదారి వేయటానికి వీలులేదని, అలా వేస్తే మేము కూడా గృహాలు, పశువుల పాకలు వేసుకుంటామని అధికారులను బెదిరిస్తున్నారు. దీని కారణంగా అధికారులు రోడ్డు వేయటానికి ప్రయత్నించినా సాధ్యపడలేదు. ఇదిలాఉండగా ప్రభుత్వం మంజూరు చేసిన మిల్క్ వెండర్



గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ

కేంద్రం కూడా ఈ స్థలం పక్కన ఉన్న పోరంబోకు స్థలంలో నిర్మాణం ప్రారంభించారు. రహదారి వేయనప్పుడు భవనం ఏ విధంగా నిర్మిస్తారని గ్రామంలో అనేక రోడ్లు, ఇతర శాఖల భవనాలు నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారని ఆరోపిస్తూ రహదారి అడుగుతున్న వారు కోర్టులు, గ్రీవెన్స్‌లు ఆశ్రయించడంతో పంచాయతీ అధికారులకు తలనొప్పిగా మారింది. దీని దృష్ట్యా గ్రామంలో ఒక దశలో పాలన స్తంభించినట్లయ్యింది. వీటన్నిటి దృష్ట్యా సమస్యలు దళితవాడ పెద్దల సమక్షంలో పరిష్కరించాలనే దృక్పథంతో గురువారం రాత్రి బాపట్ల డిఎల్‌పిఓ శరత్, ఈఒపిఆర్‌డి శేఖర్ బాబు, గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావులు గ్రామపెద్దల సమక్షంలో ఇరు వర్గాలను పిలిపించి నచ్చచెప్పారు. వారికి రోడ్డు అవసరమేనని, వీరికి మిల్క్ వెండర్ కేంద్రం అవసరమై ఉన్నందున ఇరువురూ కలిసి రెండు పనులకు అభ్యంతరాలు లేకుండా కలిసిపోయి జరిపించుకోవాలని సూచించారు. కానీ ఎవరికి వారు పట్టుదలకు పోయి చివరకు కొట్లాట వరకు వెళ్లటంతో అధికారులు చేసేదేమీలేక వెనుదిరిగి వెళ్లిపోయారు. కాగా టిడిపి, వైసిపికి చెందిన ఇరువర్గాల మధ్య భేదాభిప్రాయాలు ఉండటంతో గ్రామ పాలనకు ఇబ్బందికరంగా మారింది. ఎవరో ఒకరు తగ్గితే తప్ప సమస్య పరిష్కారం అయ్యే పరిస్థితి కనిపించటం లేదు.

విదేశీ విద్యకు ప్రభుత్వ ఆర్థిక సాయం

- జేసీ ఎం.అభిషిక్త్ కిషోర్

- విదేశీ విద్యా దీవెన చెక్కులు అందజేత



విదేశీ విద్యా దీవెన చెక్కులు అందజేస్తున్న జేసీ అభిషిక్త్ కిషోర్, జడ్‌పి చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విదేశాలలోని ప్రముఖ విద్యాసంస్థలలో ఉన్నత చదువులు చదువుకోవడానికి పేదరికం అడ్డురాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయంతో అండగా నిలుస్తోందని సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ తెలిపారు. ఎస్‌సి,ఎస్‌టి, బిసి, మైనార్టీ, ఇబిసి విద్యార్థుల కోసం ప్రవేశ పెట్టిన 'జగనన్న విదేశీ విద్యా దీవెన' పథకంలో భాగంగా 2022-23 విద్యా సంవత్సరానికి మొదటి విడత నిధులు విడుదల సందర్భంగా తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రకాశం జిల్లా నుంచి జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి జేసీ పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులైన విద్యార్థులకు బ్యాంకు చెక్కులను అందించారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ టాప్ -100 క్యుఎస్ ర్యాంక్ విశ్వవిద్యాలయాలలో ప్రవేశం పొందిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు గరిష్ఠంగా రూ.1.25 కోట్ల వరకు, మిగిలిన వారికి గరిష్ఠంగా రూ.కోటి వరకు వంద శాతం ట్యూషన్ ఫీజును ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేస్తుందన్నారు. టాప్ 101-200 క్యుఎస్ ర్యాంకులు పొందిన యూనివర్సిటీలలో ఎంపికైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు గరిష్ఠంగా రూ.75 లక్షల వరకు వంద శాతం ట్యూషన్ ఫీజును ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేస్తుందన్నారు. మిగిలిన విద్యార్థులకు గరిష్ఠంగా రూ.50 లక్షలు లేదా ట్యూషన్ ఫీజులో 50 శాతం ఏది తక్కువైతే దానిని చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రకాశం జిల్లా నుంచి ఐదుగురు విద్యార్థులు ఈ పథకంలో లబ్ధిపొందినట్లు జేసీ తెలిపారు. వీరిలో ఒకరు ఎస్‌సి, నలుగురు ఇబిసి విద్యార్థులు ఉన్నారన్నారు. తొలివిడతలో భాగంగా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలలో రూ.38,93,250 ప్రభుత్వం జమచేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం చేస్తున్న ఈ సహాయాన్ని వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన సూచించారు. జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి లక్ష్మానాయక్, బిసి సంక్షేమ అధికారి మంజులాదేవి, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, వికలాంగుల సంక్షేమ అధికారి అర్చన, మైనార్టీ సంక్షేమ అధికారి ఝాన్సీ, ఇతర అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : బాలినేని



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

దామోదర సంజీవయ్య కొత్త కూరగయాల మార్కెట్‌లో వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. మార్కెట్ ప్రాంగణంలో వ్యాపారులతో ఎమ్మెల్యే శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో నెలకొని ఉన్న షాపు అద్దెలు, ఇతర సమస్యల గురించి వ్యాపారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి వ్యాపారులకు ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని ఈసందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ బెంతశెట్టి శైలజ, ఎఎంసి చైర్మన్ కొటారి రామచంద్రరావు, మార్కెట్ వ్యాపారులు వనమా సుబ్బారెడ్డి, పురిణి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం : కమిషనర్



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్, ఒంగోలు నియోజకవర్గ హౌసింగ్ ప్రత్యేకాధికారి ఎం. వెంకటేశ్వర రావు లబ్ధిదారులకు సూచించారు. నేషనల్ హౌసింగ్ డే సందర్భంగా మండల పరిధిలోని కరవది గ్రామంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కరవది రెడ్డిపాలెం, కుమ్మరిపాలెంలో నిర్మాణంలోనున్న గృహాలను సందర్శిం చారు. లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న గృహాలు మంజూరు అయిన లబ్ధిదారులు తమ గృహాలను వేగవంతంగా నిర్మించుకో వాలని చెప్పారు. లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన లోన్లు త్వరగా ఇప్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అన్నీ నిర్మాణాలు ఉగాది నాటికి పూర్తి చేసుకునేలా లబ్ధిదారులు కృషి చేయాలని కోరారు. కమిషనర్ వెంట ఎంపిడిఒ, హౌసింగ్ అధికారులు ఉన్నారు.

పోరుబాట ధర్నాను జయప్రదం చేయండి

సిపిఐ నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి పిలుపు



మాట్లాడుతున్న పివిఆర్ చౌదరి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

టిడ్కో గహాలు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని, జగనన్న కాలనీ ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలనే డిమాండ్లతో ఈ నెల 6న ఒంగోలు కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించే సిపిఐ పోరుబాట ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి పివిఆర్. చౌదరి పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరిగిన నిర్మాణ వస్తువుల ధరలకు అనుగుణంగా జగనన్న కాలనీ గహ నిర్మాణాలకు ఐదు లక్షలు ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే సిమెంట్, స్టీల్, ఇటుకలు, ఇసుక, కంకర, కిటికీలు, తలుపులు ధరలు పెరగడంతో పాటుగా కూలీల ధరలు కూడా బాగా పెరిగాయి. టిడ్కో గహాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. జగన్ అన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు ఇప్పటికీ కల్పించకపోవడం దారుణయన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సిపిఐ పోరుబాటలో భాగంగా ఈనెల6న కలెక్టరేట్ల వద్ద నిర్వహించే ధర్నాలను జయప్రదం చేయాలన్నారు. సిపిఐ ఒంగోలు నగర సీనియర్ నాయకులు ఎస్‌డి. సర్దార్ మాట్లాడుతూ జగనన్న కాలనీలకు రూ.5 లక్షల కేటాయించాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు వంతున నివేశిత స్థలాలు ఇవ్వాలని కోరారు.



స్టడీమెటీరియల్ అందజేస్తున్న డాక్టర్ హరిబాబు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -శింగరాయకొండ

మండల పరిధిలోని మూల గుంటపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్టడీ మెటీరియల్ చేశారు. ప్రముఖ వైద్యులు జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ బి. హరిబాబు చేతుల మీదుగా స్టడీ మెటరియల్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో అందజేస్తున్న స్టడీ మెటీరియల్ విద్యా ర్థులకు ఎంతగానో ఉపయోగపడు తుందని తెలిపారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఈ స్టడీ మెటీరియల్‌ను తయారు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు జె. కేశవరాజు, ఎపిజిబి మేనేజర్ జె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఇంతియాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరే రామ్, జన విజ్ఞాన వేదిక నాయకులు కోటపాటి నారాయణ, ఎంవివి. ప్రతాప్ రెడ్డి, వి. నాగార్జున ,ఉపాధ్యాయులు వివి. రమణారెడ్డి, ఆనంద్ కుమారి,ఎం. మల్లికార్జునరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.



షరీఫ్‌కు డాక్టరేట్ సర్టిఫికెట్ అందజేస్తున్న శ్రీధర్

పేస్ అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం అధ్యాపకుడు జబీహుల్లా షరీఫ్ కు చెన్నైకి చెందిన సవిత యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ పేర్కొన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో చెన్నైకి చెందిన సవిత యూనివర్సిటీ బాధ్యులు షరీఫ్‌కు శుక్రవారం డాక్టరేట్ ను ప్రదానం చేసి సత్కరించారు. ఎక్సపరిమెంట్ ఇన్వెస్టిగేషన్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ అగ్రిజియా అనే అంశంపై ప్రొఫెసర్ మధు పర్యవేక్షణలో షరీఫ్ చేసిన పరిశోధనకు ఈ అవార్డు లభించింది. అగ్రిజియా జాలిబ్రిస్రిన్స్ అనే మొక్కల నుంచి ఫైబర్ ను తీసి దీనికి ఎపాక్సీ మెటీరియల్‌ను కలిపి కంపోజిట్ మెటీరియల్ తయారు చేశారు. దీనిపై మెకానికల్ ప్రాపర్టీస్ తో పరీక్ష చేయగా సింథటిక్ మెటీరియల్స్ తో పోల్చి చూసినప్పుడు దఢత్వం, గట్టిదనం అధికంగా ఉన్నట్లు పరిశోధనలో తేలింది. అందుకు గానూ సవిత యూనివర్సిటీ వారు షరీఫ్‌కు అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, పిన్సిపల్ మూర్తి, ఎఒ రమణబాబు, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్ ఆర్ వీరాంజనేయులు, మెకానికల్ విభాగాధిపతికొండయ్య, కళాశాల అధ్యాపక సిబ్బంది అవార్డు గ్రహీత షరీఫ్ కు అభినందనలు తెలిపారు.

'ఇల్లూరి'కి డాక్టరేట్



వెంకటనారాయణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని గురిజేపల్లె గ్రామానికి చెందిన ఇల్లూరి వెంకట నారాయణకు ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. వెంకట నారాయణ బోయలపల్లెలో పదో తరగతి వరకూ చదివాడు. మార్కాపురంలోని శ్రీసాధన జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, ఐడియల్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంకాం పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యనభ్యసిచాడు. ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. ఉద్యోగం చేస్తూనే జిల్లాకు సంబంధించిన ఆక్వా రంగం, ఆర్థిక, మార్కెటింగ్ పద్ధతులపై పరిశోధన చేయాలని నిర్ణయించుకున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ ఎన్.కిషోర్ బాబు మార్గదర్శకంలో ఏ స్టడీ ఆన్ ఫైనాన్షియల్ అండ్ మార్కెటింగ్ ప్రాక్టీసెస్ ఆఫ్ ఇన్‌ల్యాండ్ ఆక్వాకల్చర్ విత్ రెఫరెన్స్ టు వెస్ట్ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై వెంకటనారాయణ విశ్లేషణాత్మకత వివరాలతో కూడిన సమగ్ర సమాచారంతో ప్రయోజనాత్మకమైన, పరిశోధనాత్మక సిద్ధాంతాన్ని ప్రతిపాదించి విశ్వ విద్యాలయానికి సమర్పించారు. అందుకుగానూ ఆయనకు ఇటీవల ఆంధ్రా యూనివర్సిటీ పిహెచ్‌డిని ప్రదానం చేసింది. ఈ సందర్భంగా వెంకట నారాయణను పలువురు అభినందించారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం

మద్దిపాడు : చిరుధాన్యాలతో ఆర్యోగంగా జీవించ వచ్చునని ఆత్మపీడీ అన్నపూర్ణ తెలిపారు. మండల పరిధిలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో మహిళా రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులను ఉపయోగించి ఇంటి పెరటి స్థలంలో చిరుధాన్యాలు పడించడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమం ఎపిఎం బి. నరేంద్ర కుమార్, సిసిలు స్వర్ణ లత, మోహన్ రావు, ప్రేమనంద్, ఫార్మమిత్రలు సందీప్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-సిఎస్.పురం

తమ పట్టా భూములను అధికారులు లంచాలు తీసుకొని ఇతరులపేరుతో ఆన్‌లైన్ చేశారని,తమ భూములు తమకే చెందాలని కోరుతూ తహశీల్దారు కార్యాలయం ఎదుట బాధితులు చేపట్టిన ధర్నా శుక్రవారానికి రెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ మండల పరిధిలోని డిజి.పేట గ్రామానికి చెందిన షేక్ నన్నేబీ, షేక్.నాగూర్‌మీరావలికి సంబంధించిన సర్వే నెం.56, 67/1లో భూమిని రెవెన్యూ అధికారులు ఇతరుల పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. ఈ విషయం గురించి ఆర్‌డిఒ, జేసీ, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేసిన ఫలితం లేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ భూమిని తమ పేరుతో ఆన్‌లైన్ నమోదు చేయాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

పెద్దారవీడు : మండల పరిధిలోని సానికవరం గ్రామంలోని సత్రాల వద్ద మార్కాపురం జిబిఆర్ హాస్పటల్స్ వారి ఆధ్వర్యంలో శుక్రవారంఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు

హుస్సేన్‌పురంలో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి - వెలిగండ్ల

మండల పరిధిలోని హుస్సేన్‌పురంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు ఇంద్రభూపాల్‌రెడ్డి, కె.భాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ కొండూ విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు ఆవుల మాలకొండారెడ్డి, తమ్మినేని పెద్దిరెడ్డి, కాకునూరి శ్రీనివాసులు, కేలం చంద్రశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డిపల్లి పంచాయతీ పార్టీ అధ్యక్షులు గిద్దా గురుస్వామి, ఐటీడీపి కన్వీనర్ కోలా నరేష్, పద్మనాభరెడ్డి, మహిళా నాయకులు తూమాటి బుజ్జమ్మ, పోలా శారమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - టంగుటూరు

మండల పరిధిలోని జయవరం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మాదిగ జనసేవా సమితి ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పెన్నులు, పలకలు, పెన్సిళ్లు శుక్రవారం పంపిణీ చేసినట్లు ఎంజెఎస్ఎస్ ఉపాధ్యక్షుడు బాలకోటయ్య తెలిపారు. జయవరం గ్రామానికి విచ్చేసిన ఎంజెఎస్ఎస్ సభ్యులు విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మల్లవరపు జయరామిరెడ్డి, మేదరమెట్ల భరత్ రెడ్డి, ఎంజెఎస్ఎస్ అధ్యక్షుడు జివి. భాస్కర్, ఎం యోనా, ఎ. అమ్మయ్య, పి.జయరావు, జోషి హేమంత్, జి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ జివి.కష్టారావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ సచివాలయ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు.

పంటలు పరిశీలన

ప్రజాశక్తి - వెలిగండ్ల

మండల పరిధిలోని హుస్సేన్‌పురం రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ క్రాఫ్ నమోదు చేసిన సర్వే నెంబర్లను తహశీల్దారు సిహెచ్.నాగార్జునరెడ్డి, ఎఒ ఎన్.రంగకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. హుస్సేన్‌పురం, పెరుగుపల్లి గ్రామాల్లో ఈ క్రాప్ నమోదు చేసిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ ఎన్.రంగకృష్ణ మాట్లాడుతూ ఇ-క్రాప్‌లో నమోదైన ప్రతి రైతు ఇకెవైసి చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ నవీన్, విఎఎ షారుక్, రైతులు పాల్గొన్నారు.

కాలక్షేపం కోసం విధులు నిర్వహిస్తే చర్యలు

గుంటూరు మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ మధుకుమార్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్



రికార్డులు పరిశీలిస్తున్న మధుకుమార్

సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు కాలక్షేపం పేరుతో ఉద్యోగాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని గుంటూరు మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ పి.మధుకుమార్ తెలిపారు. మార్కాపురంలోని పట్టణంలోని ఒకట సచివాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు అందరూ తమ వార్డు పరిధిపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. అనుమతులు లేని కట్టడాలను గుర్తించి, ఇంటి యజమానికి అవగాహ కల్పించి అనుమతులు తీసుకోనేవిధంగా చూడాలన్నారు. అందుకు నిరాకరిస్తే వారికి యుసిఐఎంఎస్ యాప్ ద్వారా నోటీసులు ఇవ్వాలన్నారు. అప్పటికీ స్పందించక పోతే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు ఒక గంటవార్డులో ప్రతి ఉద్యోగి పర్యటించాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు భయపడేవారు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి వెళ్లిపోవాలన్నారు. అనంతరం సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సర్వీసులు, సిబ్బంది హాజరు పట్టిని పరిశీలించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి సచివాలయాలకు వస్తారని సిబ్బంది వారిని మర్యాదగా పలకరించి వీలైనంత మేర వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సచివాలయాల పరిసరాలలో పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు చెత్త సేకరణలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, టిటిఒ పూర్ణచంద్రరెడ్డి, మార్కాపురం మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్, ఇన్‌ఛార్జి టిపిఒ ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పొదిలి



నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి కార్మికులు

ఆర్‌టిసి కార్మికులకు ఓవర్ టైమ్ డబ్బులు ఏ రోజుకు ఆరోజే చెల్లించాలని కోరుతూ ఎస్‌డబ్ల్యుఎఫ్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆర్‌టిసి జోనల్ ఉపాధ్యక్షుడు అల్లడి సుబ్బారావు మాట్లాడుతూ కార్మికులపై యాజమాన్యం వేధింపులు మానుకోవాలన్నారు. సర్క్యులర్ 1-2019ను యథాతథంగా అమలు చేయాలన్నారు. కార్మికులకు స్వేచ్ఛ ఇచ్చి కొత్త చార్టులు వేయాన్నారు. డబుల్ డ్యూటీలు చేసిన వారికి ఆరోజే నగదు చెల్లించాలన్నారు. కార్మికుల నిరసనకు ఇతర సంఘాల నాయకులు ఎస్‌కె.బాషా, జెఎస్.రాజు, జిలానీ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి వేణుగోపాల్, సంఘం నాయకులు ఇజ్జగిరి శ్రీను, పేర్నమిట్ట శ్రీను, మునిరాజు, షరీఫ్, కిషోర్, వెంకటరావు, మంగపతి, వి.రమేష్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- కంభంరూరల్

పాఠశాల విద్యార్థులు అభ్యసన నైపుణ్యాలపై పట్టు సాధించడంతో పాటు శాస్త్రీయ దక్పథాన్ని అలవరచుకోవాలని కాంప్లెక్స్ చైర్మన్ కె.శార్వాణి తెలిపారు. స్థానిక బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థుల రాత నైపుణ్యాలను, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం పాఠశాల పరిసరాలు, సౌకర్యాలను వీక్షించారు. నిర్మాణాత్మక మరియు సంగ్రహణాత్మక పరీక్షల ఫలితాలపై ఆరా తీశారు. బాలికా విద్య ఆవశ్యకతను వివరిస్తూ బాలికలు చదువుతోపాటు సామాజిక స్పృహ మరియు సంస్కార శైలిని కలిగివుండాలి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పి.చాముండేశ్వరి, సిఆర్‌పి రవీంద్ర నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి- జరుగుమల్లి



కూలీల మస్టరును పరిశీలిస్తున్న ఎంపిడిఒ

అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పనికల్పించి రోజువారీ వేతనం రూ.257 వచ్చేలా చూడాలని ఎంపిడిఒ పి.రామకృష్ణ ఎపిఒను ఆదేశించారు. మండల పరిధిలోని ఎడ్లూరపాడు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను శుక్రవారం ఎంపిడిఒ పరిశీలించారు. తొలుత గ్రామంలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ చెత్త నుంచి వర్మీకంపోస్టు తయారు చేయాలన్నారు. వర్మీకంపోస్టును రైతులకు తక్కువ ధరకు విక్రయించాలన్నారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని పరిశీలించి సిబ్బంది పలుసూచనలు చేశారు. ఆయుష్మాన్ భారతి ఇకెవైసి రెండు రోజులలో 85 శాతం పూర్తి చేయాలని లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సచివాలయ కార్యదర్శి మాధురిని హెచ్చరించారు. జగనన్న కాలనీ లేఅవుట్లలో నిర్మాణాలలోనున్న గృహాలను మండల ప్రత్యేక అధికారి మాధవితో కలిసి పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ ఎఇ అవినాష్, ఎపిఒ కె.నాగరాజు, సర్పంచి రావి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సాహిత్యం ఆలోచింపజేస్తుంది

మద్దిపాడు : సాహిత్యం మనిషిని ఆలోచింపజేస్తుందని ప్రముఖ మదంగ విద్వాంసుడు దినేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక నటరాజ కళాకేంద్రం ఆవరణలో కళాకారుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్ కుమార్ మాట్లాడుతూ సాహిత్యం, సంగీతం సమాజానికి రెండు కళ్ల లాంటివని తెలిపారు. ప్రతి ఒక్కరూ సాహిత్యాన్ని ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డి. యలమంద, సత్యనారాయణ కాకుమాను సుబ్బారావు జి. నరసింహారావు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎపిఒగా జయరాజ్

శింగరాయకొండ : శింగరాయకొండ ఎపిఎంగా జయరాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎపిఒగా పనిచేస్తున్న ఆదిశేషు ఒంగోలుకు బదిలీ అయ్యారు. దీంతో కంభంలో ఎపిఒగా పనిచేస్తున్న జయరాజ్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎపిఒ జయరాజ్ ఎండిపిఒ జమీఉల్లాను మర్యాద పూర్వకంగా కలిశాడు.

ఆక్రమణలు తొలగింపు

దర్శి : నగరపంచాయతీ కమిషనర్ వై. మహేష్ ఆధ్వర్యంలో రెండో రోజూ శుక్రవారం దర్శిలో ఆక్రమణలు తొలగించారు. గడియార స్తంభం సెంటర్ నుంచి కురిచేడు రోడ్‌లో ఆంజనేయస్వామి గుడి వరకూ రోడ్డు ఆక్రమణలను నగర పంచాయతీ సిబ్బంది తొలగించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణం పాతూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆర్‌డిఒ సందీప్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలను, పౌష్టికాహారం పంపిణీ గురించి ఆరా తీశారు. అనంతరం జగనన్న కాలనీ గృహనిర్మాణాలను సందర్శించి లబ్ధిదారుతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నారాయణరావు ,మెప్మా టిఎంసి రఘు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం : కొత్తపట్నం గ్రామంలోని 57 నంబరు అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలురికార్డులను పరిశీలించారు. అనంతరం గమండ్లపాలెంలోని జగనన్న లేఔట్లలో గృహ నిర్మాణాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి

దర్శి : తాళ్లూరు మండలంలోని వెలుగువారిపాలెం గ్రామంలో జలజీవన్ పథకంలో భాగంగా రూ. 70 లక్షలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ సర్పంచి ముచ్చుమారి కోటేశ్వరమ్మ బ్రహ్మారెడ్డి తెలిపారు. 600 ఇళ్లకు ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచి తెలిపారు. ప్రస్తుతం ఎస్‌సి కాలనీ 150 ఇళ్లకు ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని మిట్టమీద 250 ఇళ్లకు కొళాయిలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరో 200 ఇళ్లకుకొళాయిలు బిగించి నీటిని సరఫరా చేస్తామన్నారు.

విశ్వనాథ్‌కు ఘన నివాళి

ఒంగోలు కలెక్టరేట్ : ప్రముఖ దర్శకులు, కళాతపస్వి, పద్మశ్రీ, దాదాసాహెబ్ ఫాల్కే, రఘుపతి వెంకయ్య అవార్డు గ్రహీత కె విశ్వనాథ్‌కి జిల్లా రంగభూమి కళాకారులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత, దర్శకులు, పడమటి గాలి ఫేమ్ పాటిబండ్ల ఆనందరావు మాట్లాడుతూ సినీ పరిశ్రమ ఒక మంచి దర్శకుడిని కోల్పోయిందని ఆయన సినిమాలన్నీ మంచి సందేశాత్మకమైనవన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ మాజీ సభ్యులు ధేనువకొండ సుబ్బయ్య, జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, అభినయ అధ్యక్షుడు అన్నమనేని ప్రసాద్, ప్రకాశం జిల్లా పౌరాణిక రంగస్థల కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు వాకా సంజీవరెడ్డి, ప్రముఖ గాయకులు నూకతోటి శరత్ గుర్రం కృష్ణ, తాళ్లూరి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ ధర్నా



ఆర్టీసీ బస్టాండులో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు డిపో అధ్యక్షుడు గంగాధర్ అధ్యక్షతన ధర్నా జరిగింది. అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ గత 5 నెలల నుంచి కార్మికులచే ఒటి డ్యూటీలు చేయించుకొని వాటి అలవెన్స్ ఇవ్వకుండా యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందని, అతి తక్కువ వేతనాలతో కుటుంబం నడపలేక వత్తిడితో బాషా అనే కండక్టరు గుండెపోటుతో మరణించినట్లు తెలిపారు. ఇలాంటి మరణాలు జరగక ముందే కార్మికులకు రావలసిన బకాయిలను పూర్తిగా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ బాపట్ల జిల్లా కార్యదర్శి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కార్మికులకు 2017 పేస్కేలు అరియర్స్, 2017 నుంచి ఎన్‌క్యాష్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు రావలసిన అలవెన్సులను డ్రా చేసుకునేందుకు మాత్రం ఎటువంటి ఆటంకాలు ఉండవని విమర్శించారు. కార్మికులకు రావలసిన వాటికి మాత్రం సవాలక్ష అడ్డంకులు చెప్పడం సమంజసం కాదని అన్నారు. 1/2019లో కార్మికులు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న సర్క్యులర్‌ను అధికారులు వారి ఇష్టానుసారం ఉపయోగించుకుంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదని, ఎస్‌డబ్ల్యూఎఫ్ దీనిని తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇవ్వలేనిచో ఆ డ్యూటీలను 8 గంటల డ్యూటీలుగా మార్చాలని కోరారు. ప్రస్తుతం ఒక్కొక్క కార్మికునికి 4 నుంచి 5 లక్షల వరకు యాజమాన్యం బకాయి ఉందని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో షంషావలి, ఫణీంద్ర, శ్రీనివాసరావు, అనూష, శేఖర్, సుబ్బారావు, ఆర్టీసి కార్మికులు పాల్గొన్నారు.

సంతమాగులూరు ఎంపీపీగా యలమంద



ఎలమందకు నియామకపత్రం అందజేస్తున్న ఆర్డీవో సరోజిని

ప్రజాశక్తి-సంతమాగులూరు

సంతమాగులూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి ఆకస్మిక ఎన్నిక శుక్రవారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో ప్రశాంతంగా జరిగింది. అధ్యక్షుడిగా పాతమాగులూరు ఎంపీటీసీ ఎనుబర్ల యలమందను సభ్యులు చేతులెత్తి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆర్డీవో సరోజిని తెలిపారు. అనంతరం నియామక పత్రాన్ని ఎలమందకు అందజేశారు. దీంతో నెల రోజులుగా ఒకే పార్టీలోని రెండు గ్రూపుల మధ్య కొనసాగుతున్న ఉత్కంఠకు తెరదించారు. మండలంలో 17 మంది ఎంపీటీసీ సభ్యులున్నారు. అందులో సంతమాగులూరు ఎంపీటీసీ సభ్యులు అట్లా చిన్న వెంకటరెడ్డి, ఎంపీపీగా సంవత్సరంపాటు కొనసాగారు. అనంతరం తన వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఎంపీపీ పదవికి, సంతమాగులూరు ఎంపీటీసీ స్థానానికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆరు నెలల పాటు మండల ఉపాధ్యక్షులైన ఎలుబర్ల ఎల్లమంద విధులు నిర్వహించారు. అధికారికంగా ఎంపీపీ పదవికి ఎన్నిక నోటిఫికేషన్ రావడంతో, ఒకే పార్టీలోని రెండు వర్గాల వారు పోటీపడ్డారు. ముందుగా ఒప్పందం ప్రకారం అట్లా చిన్న వెంకటరెడ్డి మూడు సంవత్సరాలు, ఏల్చూరు ఎంపీటీసీ నెంబరు ఓరుగంటి కోటిరెడ్డి రెండు సంవత్సరాలు పాటు ఎంపీపీగా కొనసాగేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ ఏడాది పాటు ఎంపీపీగా కొనసాగి రాజీనామా చేసిన అట్లా చిన్న వెంకటరెడ్డి, ఇంకో సంవత్సరం న్నర పాటు తన వర్గీయులకే చెందాలని పట్టుబట్టాడు. దీంతో రెండో వర్గం నాయకుడు ఓరుగంటి కోటిరెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వద్ద పంచాయతీ కూడా పెట్టారు. అయినా అట్లా చిన్న వెంకటరెడ్డి వర్గీయులైన మండల ఉపాధ్యక్షుడు ఎనుబర్ల ఎలమందను సభ్యులు ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో 16 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను 13 మంది హాజరయ్యారు. ఏల్చూరులో ఒకరు, కుందుర్రు గ్రామంలో ఇద్దరు ఎంపీటీసీలు న్నికల్లో పాల్గొనలేదు. కోరం ఉన్నందున ఎన్నిక జరిపినట్లు ఆర్డీవో తెలిపారు. అధ్యక్షులుగా ఎన్నికైన ఎలమందను రాష్ట్ర శాప్ నెట్ కార్పొరేషన్ చైర్మన్, వైసిపి అద్దంకి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య, వైసిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి అట్ల చిన్న వెంకటరెడ్డి పూల దండలు వేసి అభినందనలు తెలియజేశారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు ఎలమందకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం సాంబశివరావు, తహశీల్దారు అశోక్ వర్ధన్, మండల ప్రత్యేక అధికారి రాజేష్, ఈ ఓ ఆర్ డి ప్రసాద్ రావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సన్నెబోయిన గురుయాదవ్, గాలెయ్య, ఆలూరి శ్రీనివాసరావు, అట్లా పెద్ద వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి మొండిచేయి: సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు మణిలాల్

ప్రజాశక్తి-రేపల్లె

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి మొండిచేయి చూపించారని, సామాన్యులకు కోతలు, సంపన్నులకు సంపదలు అన్నరీతిలో బడ్జెట్ ఉందని సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి మణిలాల్ విమర్శించారు. ఇది పూర్తిగా అభివృద్ధి నిరోధక బడ్జెట్ అని ఆయన అభివర్ణించారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మణిలాల్ మాట్లాడుతూ కేంద్రం ఎప్పటి మాదిరిగానే 2023-24 బడ్జెట్‌లోనూ ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రజల హక్కు అయిన ప్రత్యేక హెూదాకు మొండిచెయ్యి చూపిందని పేర్కొన్నారు. విభజన హామీలను పూర్తిగా అటకెక్కించింది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి బాధ్యత తన మొసలి కన్నీరు కార్చిన ప్రధాని గత ఎనిమిది సంవత్సరాలుగా ద్రోహం చేస్తూనే వచ్చారు. రాష్ట్ర అభివృద్ధిని అదానికి బిజెపి తాకట్టుపెట్టిందని అన్నారు. విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ వంటి వాటి ఊసెత్తలేదు. ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ ఉక్కును బలపర్చుకోడానికి ఎలాంటి ప్రతిపాదన లేదు. ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లా వంటి వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఎలాంటి నిధులూ కేటాయించలేదు. ప్రతిష్టాత్మక విద్యా సంస్థల సంగతి అలాగే ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల గిరిజన విశ్వ విద్యాలయాలకు 2022-23 సంవత్సర బడ్జెట్‌కన్నా 15 శాతం కోత విధించడం అమానుషం. మొత్తం 62 పేజీల బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ఆంధ్రప్రదేశ్ అన్నమాటనే ఉచ్ఛరించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కర్ణాటకు కొత్తగా ప్రత్యేక కేటాయింపులు చేసిన కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరాన్ని నిర్లక్ష్యం చేసింది. నిర్వాసితులకు మొండిచేయి చూపింది. రాజధాని అభివృద్ధిని నిర్లక్ష్యం చేసింది. మొత్తం దేశవ్యాప్తంగా ఉపాధి హామీ కేటాయింపుల్లో సగం కోతపెట్టడం, ఆహారం, ఎరువులపై సబ్సిడీలను ఘోరంగా కుదించడం వల్ల సామాన్యులు తీవ్ర ఇక్కట్లపాలవుతారు. విద్యుత్ సంస్కరణలు, పట్టణాల్లో యూజర్ ఛార్జీల వంటివి జనం నడ్డి విరుస్తాయి. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి నామమాత్రపు కేటాయింపులు చేసింది. దేశంలో 16 శాతం ఉన్న షెడ్యూల్డ్ కులాలకు కేవలం 3.5 శాతం మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారు. అలాగే 8.6 శాతంగా ఉన్న షెడ్యూల్ జాతులకు కేవలం 2.7 శాతం మాత్రమే కేటాయించారు. సబ్‌ప్లాన్ గురించి ప్రస్తావనే లేదు. ఆ తరగతులకు ఈ బడ్జెట్ పూర్తిగా అన్యాయం చేసింది. రాష్ట్రానికి తీవ్ర నిరాశకలిగించిన కేంద్ర బడ్జెట్‌ను ఇప్పటికయినా రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం వ్యతిరేకించాలి. ద్రోహపూరిత బడ్జెట్‌ను నిరసించవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం నేతలు కె రమేష్, జి ధర్మరాజు, బి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కుష్టు వ్యాధి గురించి విద్యార్థులకు వివరిస్తున్న డాక్టర్ జయకుమార్

కుష్టువ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి-వేటపాలెం

కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని పందిళ్లపల్లి హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పందిళ్లపల్లి ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్ జయకుమార్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమం గురించి వివరించారు. వ్యాధి లక్షణాలు, వ్యాపించు విధానం, చికిత్స విషయాల గురించి విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ పి వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్లు జె సుధాకర్, ఎన్ సలోమి, ఎఎన్ఎం బి విజయకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి కాశీవిశ్వనాథం

వ్యవసాయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి-వేటపాలెం

రైతు భరోసా కేంద్రంలో రైతులు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఐ కాశీవిశ్వనాథం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం స్థానిక రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని రైతులందరికీ తెలియజేయాలని, ఇంకా ఎవరైనా పంట నమోదు చేయకుంటే వారికి తెలియపర్చాలని అన్నారు. వరి కొనుగోలు కేంద్రాలు ఉపయోగించుకోవాలని, పిఎం కిసాన్ ఇకెవైసి చేయించుకోవాని కోరారు.



సాయం అందజేస్తున్న కర్లపాలెం ముస్లిం పెద్దలు

నిరుపేద కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-కర్లపాలెం

మాట్లాడే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే మదర్ థెరిసా సూక్తిని స్ఫూర్తిగా తీసుకొని నిరుపేదలకు సాయం చేస్తున్నామని మాజీ కో ఆప్షన్ సభ్యులు తాజ్ తెలిపారు. శుక్రవారం కర్లపాలెం గ్రామంలోని ముస్లిం పెద్దల సహకారంతో గ్రామంలో నిరుపేద మహిళకు 10 కేజీల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలో ప్రతి శుక్రవారం ఒక కుటుంబానికి సాయం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాషా, పఠాన్ తదితరులు పాల్గొన్నారు.



ఇంకొల్లులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఆమంచి కృష్ణమోహన్

దాతల కృషి అభినందనీయం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

అంబేద్కర్ నగర్‌లో శ్మశానం అభివృద్ధికి దాతల కృషి అభినందనీయమని వైసిపి పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. ఇంకొల్లు అంబేద్కర్ నగర్‌కు చెందిన తానికొండ వీరయ్య కుమారుడు గంగాధర్ జ్ఞాపకార్థం విజయభారతి రూ.2 లక్షల వ్యయంతో శ్మశాన వాటికలో గ్రావెల్ రోడ్డు, వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయ భారతిని ఆమంచి కృష్ణమోహన్ అభినందించారు. కార్యక్రమంలో ఎంపిపి బండారు అనూష రాజ్‌కుమార్, వైస్ ఎంపిపి సయ్యద్ లతీఫ్, సర్పంచ్ ఏజర్ల ప్రసన్న సైమన్‌బాబు, షేక్ ఉస్మాన్, ప్రసాద్, సునీల్, సురేష్, చిన్ని పూర్ణారావు, గోపాలస్వామి, తానికొండ రజనీకాంత్, మంగారావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



ప్రమాద బాధితులకు సహాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

కొల్లూరు మండలం తోకలవానిపాలెం గ్రామంలో ఇటీవల ఇటుక రాయి కూలీల పూరి గుడిసెలు అగ్ని ప్రమాదానికి గుర్రై పూర్తిగా నిరాశ్రయులయ్యారు. వీరికి శుక్రవారం మదర్ థెరిస్సా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బియ్యం, నిత్యాసర సరుకులు మండల తహసీల్దార్ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. మానవతా దృక్పథంతో స్వచ్ఛంద సంస్థలు సహాయం అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ టి కృష్ణమోహన్, నాయకులు జి సుధాకర్ తదితరులు ఉన్నారు.



షెడ్ పరిసరాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి కాశీవిశ్వనాథం, పంచాయతీ సెక్రటరీ పూర్ణకుమారి

అక్కాయపాలెం ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ వద్ద పచ్చదనం-పరిశుభ్రత

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని అక్కాయపాలెం పంచాయతీ పరిధిలోని గ్రామశివారులో ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ వద్ద శుక్రవారం పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ ఐ కాశీవిశ్వనాథం మొక్కలు నాటి నీళ్లు పోశారు. షెడ్ వద్ద పచ్చదనానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కాశీవిశ్వనాథం సూచించారు. షెడ్ పరిసరాలను, అక్కడ నిర్వహణ విధానాన్ని ఈ సందర్భంగా సెక్రెటరీ పర్నం పూర్ణకుమారి స్పెషల్ ఆఫీసర్‌కు వివరించారు. అదేవిధంగా పాపాయిపాలెం ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ వద్ద కూడా పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

దేవాదాయ భూములు

ఆక్రమించుకున్న వారిపై కఠినచర్యలు

అసిస్టెంట్ కమిషనర్ గ్రంధి మాధవి

ప్రజాశక్తి-పామూరు

దేవాదాయ భూములు ఆక్రమించుకున్న వారికి నోటీసులు ఇవ్వాలని వారిపై క్రిమినల్ కేసులు పెడతామని అసిస్టెంట్ కమిషనర్ గ్రంధి మాధవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని మదన వేణుగోపాల స్వామి మరియు భుజలింగేశ్వరస్వామి దేవాలయాలకు సంబంధించిన భూములను ఆమె పరిశీలించారు. ఆక్రమించుకున్న వారికి నోటీసులు ఇస్తామన్నారు. ఇరువూరు రోడ్‌లో సర్వే నెంబరు 257/2లో య.1.06 సెంట్లు భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేశారు. పక్కనే ఉన్న సర్వే నెంబరు 256/2 లో 29.63 సెంట్లు భూమిలో కొందరు ఫెన్సింగ్, రూములు వేయగా వాటిని తొలగించారు. నెల్లూరు రోడ్‌లోని సర్వేనెంబరు 322/11 లో య.0.55 సెంట్లు స్థలంలో రూములు నిర్మిస్తుండగా వాటిని వెంటనే నిలిపివేయాలని ఆమె ఆదేశించారు. వెంటనే వీరికి నోటీసులు ఇవ్వాలని ఎండోమెంట్ అధికారులకు చెప్పారు. అనంతరం ఎన్‌జిఒ కాలనీలో భవనాలు నిర్మించుకున్నామని, రిజిస్ట్రేషన్‌లు ఆగిపోయాయని, వెంటనే సహకరించి రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని రిటైర్డు ఉపాధ్యాయులు గల్లా చెన్నయ్య, శ్రీనివాసరాజు, వెంకటస్వామి సంబంధింత రికార్డులను ఆమెకు అందజేశారు. హెచ్చరిక బోర్డు నిర్మిస్తుండగా కొందరు అడ్డుకోవడంతో ఎస్ఐ కె.సురేష్ పోలీసు సిబ్బందితో వారిని అడ్డుకోవడంతో సమస్య సద్దుమణిగింది.



పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ గ్రంధి మాధవి

సీపీఆర్‌తో ప్రాణం కాపాడొచ్చు

- ఎస్పీ మలికగర్గ్
- ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించిన 'రమేష్ సంఘమిత్ర' వైద్యులు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

అత్యవసర సమయంలో సీపీఆర్‌తో ప్రాణం కాపాడొచ్చని ఎస్‌పి మలిక గర్గ్ పేర్కొన్నారు. ఏ.ఆర్ 'డీ మొబలైజేషన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఆర్మడ్ రిజర్వు పోలీసు అధికారులు, సిబ్బందికి కార్డియో పల్మనరీ రిసక్సిటేషన్ (సీపీఆర్), వివిధ ప్రథమ చికిత్స విధానాలపై డెమోల ద్వారా అవగాపన కల్పించారు. హార్ట్‌ఎటాక్ లక్షణాలు ఏ విధంగా ఉంటాయి, అకస్మాత్తుగా గుండె ఆగిపోయినప్పుడు తక్షణమే అందించాల్సిన ప్రథమ చికిత్స విధానాలపై జిల్లా పోలీస్ యూనిట్ డాక్టర్ భానుమతి సిబ్బందికి వివరించారు. అనంతరం సంఘమిత్ర హాస్పిటల్‌కు చెందిన సిపిఆర్ ఎమర్జెన్సీ టెక్నీషియన్స్ సిపిఆర్ ఏ విధంగా చెయ్యాలో సిబ్బందికి డెమో ద్వారా అవగాహన కల్పించారు. గుండెపై ఒక క్రమ పద్ధతిలో ఒత్తిడి కలిగించేలా చేసే పద్ధతినే సీపీఆర్ అంటారని, గుండె ఆగిపోయిన వ్యక్తిని సమతలంగా నేలపై పడుకోబెట్టి ఛాతిపై రెండు చేతులు ఉంచి గట్టిగా పుష్ చేస్తూ సిపిఆర్ ప్రక్రియ చేయాలని, ఒక నిమిషానికి 100 నుండి 120 కంప్రెషన్స్ వరకు చేయాలని, మధ్యలో ప్రతి 30 కంప్రెషన్స్‌కు ఒకసారి కృత్రిమ శ్వాస నోటి ద్వారా అందించాలని చెప్పారు. ఇలా సిపిఆర్ చెయ్యటం ద్వారా గుండె ఆగిపోయిన వ్యక్తి అంబులెన్స్ వచ్చే వరకు లేక మెడికల్ హెల్ప్ అందేవరకు ప్రాణాలతో ఉండగలరని తెలిపారు.

రోడ్డుప్రమాదానికి గురై తలకు గాయం జరిగి రక్తస్రావం జరిగినప్పుడు, ఎముకలు విరిగినపుడు, చిన్న పిల్లలు కాయిన్స్ మింగినప్పుడు, నీటిలో మునిగిపోయి/విషం తాగి అపస్మారక స్థితిలో ఉన్న సందర్భాల్లో ఆసుపత్రికి తీసుకువెళ్లే లోపు అందించాల్సిన ప్రథమ చికిత్స పద్ధతులపై ఏఆర్ సిబ్బందికి డెమోల ద్వారా చూపించి.. వారు కూడా చేసేలా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ వెంకటేశ్వర రావు, యూనిట్ డాక్టర్ భానుమతి, ఆర్ఐ శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.



సీపీఆర్ చేసే విధానాన్ని చూపిస్తున్న దృశ్యం

కలెక్టర్‌ను కలిసిన రైతు సాధికారసంస్థ వీసీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్‌ను రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్, విశ్రాంత ఐఎఎస్ అధికారి టి.విజయ్‌కుమార్ కలిశారు. స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన పలు విషయాలు చర్చించుకున్నారు.



టి.విజయ్‌కుమార్‌తో కలెక్టర్ దినేష్‌కుమార్

మార్చి 22 నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి: కమిషనర్

ప్రజాశక్తి-చీమకుర్తి

మార్చి 22 నాటికి జగనన్న ఇళ్ళ నిర్మాణం పూర్తి చేసుకొని ఉగాదికి గృహప్రవేశాలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్‌కెఫజులుల్లా పేర్కొన్నారు. స్థానిక బూచేపల్లి కల్యాణమండలంలో జరిగిన జనగనన్న కాలనీల లబ్దిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాట్ల బేస్‌మట్టం లెవల్,లెంటల్ లెవల్,శ్లాబ్ లెవల్‌లో ఉన్న లబ్దిదారులు తప్పక గృహాలు పూర్తిచేసి, మార్చి 22న ఉగాదిరోజున గృహప్రవేశం చేయాలని సూచించారు. శ్లాబ్ పూర్తయిన వారు వెంటనే ఇంటి ముందు భాగాన ప్లాస్టింగ్ చేసుకొని, తెల్లసున్నం, నేమ్‌ప్లేట్ బిగించిన వెంటనే లబ్దిదారుల బ్యాంకు అకౌంట్‌లో ఫైనల్‌బిల్లు జమ చేయబడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చల్లాఅంకులు, కౌన్సిలర్లు భీమన వెంకటరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

రాష్ట్రం అభివృద్ధి బాటాలో నడవలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలిని మార్కాపురం శాసనసభ్యులు కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అర్హత ఉండి లబ్ధిదారులకు అందకపోతే తన దష్టికి వస్తే తప్పక సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని కే.కొత్తపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీయుతంగా అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి సంక్షేమ పథకం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ముందుగా గ్రామంలోని ఇంటింటికి తిరుగూ రాష్ట్ర ప్రభుత్వం నుండి లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటీసీ సభ్యులు నారు బాపన్‌రెడ్డి, ఎంపీపీ పోరెడ్డి అరుణ, వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, ఎంపీడీవో తోట చందన, మండల విస్తరణధికారి రామ్మోహన్‌రెడ్డి, ఎపిఎం రమేష్‌బాబు, ఎపీవో బి.జీవరత్నంద, వైకాపా నాయకులు చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-త్రిపురాంతకం

కొన్ని సంవత్సరాలుగా కిడ్నీవ్యాధితో బాధపడుతున్న త్రిపురాంతకం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన చింతపల్లి నాగరాజు, క్రాంతిల కుమారుడు చింతపల్లి లోకేష్‌ను రాష్ట్ర గ్రంథాలయ ఉపాధ్యక్షుడు రాచవర్ల పిచ్చయ్యయాదవ్ శుక్రవారం పరామర్శించారు. వైద్యఖర్చుల కోసం రూ.12 వేల ఆర్థిక సాయం అందజేశారు. సంగంతండాలో తల్లిదండ్రులు లేని ఇద్దరు విద్యార్థులకు కొంత సహాయం అందించి.. వారి చదువుకు తానే బాధ్యత తీసుకుంటానన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోకేష్‌కి ప్రభుత్వం నుండి సహాయం అందేవిధంగా రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్‌తో తనవంతు కషి చేస్తానని తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల యూత్వా అధ్యక్షులు తాటికొండ కోటి పోలరాజ్ పాల్గొన్నారు.

జనం సమస్యలు వినే నాథుడేడీ?

- గాడి తప్పిన కార్పొరేషన్ పాలన
- కమిషనర్ వెంకటేశ్వరరావు తీరుపై కార్పొరేటర్లలో అసంతృప్తి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఏదైనా సమస్య చెప్పుకునేందుకు కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చే వారికి సమస్యలు వినే నాథుడు కరువయ్యాడు. కార్పొరేషన్ పాలనలో కీలకంగా ఉన్న ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడం, దిగువస్థాయి సిబ్బంది కూడా వారివారి సీట్లలో సక్రమంగా విధుల్లో లేకపోవడంతో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక నేరుగా కార్పొరేటర్లే తలలు పట్టుకుంటున్నారు. ప్రత్యేకించి కార్పొరేషన్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పనితీరుపై పలువురు కార్పొరేటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ హెూదాలో ఉన్న వ్యక్తి ప్రతిరోజూ ఓ సమయాన్ని నిర్దేశించుకొని ఆఫీసుకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉంది. కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు కొంత సమయం కేటాయించాల్సిన పరిస్థితి ఉంటుంది. అయితే ప్రస్తుత కమిషనర్ ఎప్పుడు ఆఫీసుకు వస్తారో..? ఎప్పుడు వెళతారో కార్పొరేషన్ సిబ్బందికే అంతుపట్టని పరిస్థితి నెలకొని ఉంది. నగరంలో ఇటీవల గడపగడపకూ కార్యక్రమం అక్కడక్కడా జరుగుతోంది. ఈ కార్యక్రమం ఉదయం, సాయంత్రం వేళల్లో కొద్దిసేపు జరుగుతోంది. దీన్ని ఆసరా చేసుకొని మొత్తం కార్పొరేషన్ సిబ్బంది గడపగడపకు కార్యక్రమం పేరుతో రోజంతా ఆఫీసుకు ముఖం చాటేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గడపగడపకూ.. కార్యక్రమం జరగని రోజు సైతం ఇతరత్రా సమావేశాల పేరుతో అధికారులు కార్యాలయం మొఖం చూడటం లేదని చర్చ జరుగుతోంది.

మరోవైపు నగరపాలక సంస్థ పాలన పూర్తిగా గాడితప్పిందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. నగరంలో అక్రమ కట్టడాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. వీరి జోలికి కార్పొరేషన్ ప్రణాళికా విభాగం అధికారులు వెళ్లడం లేదు. కార్పొరేషన్ ప్రణాళికా విభాగం అంతా ప్రస్తుతం కమిషనర్ కనుసన్నల్లో పనిచేస్తుందని ప్రచారం జరుగుతోంది. దీంతో ఆ సెక్షన్ హెడ్‌గా ఉన్న వ్యక్తిని పక్కనపెట్టి సెక్షన్‌లో కీలకమైన పనులన్నీ దిగువస్థాయి సిబ్బందితో చేయిస్తున్నట్లు సమాచారం. ఒకరిద్దరు ఉద్యోగులను కమిషనర్ ప్రోత్సహిస్తున్నారని కార్పొరేషన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కమిషనర్ వేగులుగా ఉన్న కొంతమంది డమ్మీ కార్పొరేటర్లు టౌన్‌ప్లానింగ్ విభాగంలో పెత్తనం చెలాయిస్తున్నట్లు సమాచారం. వారి భార్యలు కార్పొరేటర్లు కాగా వీరు పరిపాలన వ్యవహారాల్లో అన్నీ తామై టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌ను నడిపిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో నగరంలో జరిగే అక్రమ కట్టడాలకు ప్రతి దానికీ ఓ రేటు కట్టి వసూళ్ల దందా సాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ కట్టడాలను అడ్డుకోవాల్సిన అధికారులు అడ్డుకోకపోగా ఆ సెక్షన్‌లో పనిచేసే ఉద్యోగుల మధ్య విభేదాలు పెట్టి అక్రమ సంపాదనకు ఊతం ఇస్తున్నారనే చర్చ జరుగుతోంది.

ఇంజినీరింగ్ సెక్షన్‌లో జరిగే పనుల మీద సక్రమంగా పరిశీలన ఉండటం లేదనే ఆరోపణలు వినిస్తున్నాయి. నగరంలో అక్కడక్కడా జరిగే రోడ్లు, కాల్వల నిర్మాణ పనుల మీద అధికారుల నిశిత పరిశీలన లేకపోవడంతో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని ఆ సెక్షన్‌లో దిగువస్థాయి సిబ్బంది చెప్పుకుంటున్నారు.

రెవిన్యూ సెక్షన్‌లో అవినీతికి అడ్డుఅదుపు లేకుండా పోతోంది. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు దరఖాస్తుదారుల నుంచి అందినకాడికి దోచేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పన్నుల విధింపు, ఆస్తి పన్ను పేర్లు మార్పు అంతా సచివాలయాల నుంచి జరగాల్సి ఉన్నా రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు మాత్రం నేరుగా అర్జీదారులతో మాట్లాడి ఆఫీసుకే పిలిచి లంచాలు వసూలు చేస్తున్నారని సమాచారం. ఇందుకోసం ప్రతి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రత్యేకంగా ప్రయివేటు సిబ్బందిని నియమించుకున్నారనేది కార్పొరేషన్ కార్యాలయంలో అందరికీ తెలిసిన విషయమే. రెవెన్యూ సెక్షన్‌లో అవినీతిని అడ్డుకోవాల్సిన సెక్షన్‌హెడ్‌లు, ఉన్నతాధికారులు సైతం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు ఇచ్చే పర్సంటేజీలకు ఫిదా అయ్యి పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



పారిశుధ్య విభాగంలో అధికారుల మధ్య సమన్వయలోపం కనిపిస్తోంది. ఆసెక్షన్‌కు హెడ్‌గా ఉన్న హెల్త్ ఆఫీసర్ ఆ విభాగం అధికారుల పనితీరుమీద పట్టు సాధించలేకపోయారనే విమర్శ ఉంది. ఇటీవల రెండో పారిశుధ్య డివిజన్‌లో పనిచేసే ఓ పారిశుధ్య కార్మికురాలిని ఆ పని నుంచి తప్పించి కార్పొరేషన్ కార్యాలయంలోని అకౌంట్స్ విభాగంలో అటెండర్‌గా నియమించారు. పారిశుధ్య కార్మికురాలిని తీసుకొచ్చి ఆఫీసులో అటెండర్‌గా నియమించడం పట్ల కార్పొరేషన్ కార్యాలయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఒక సెక్షన్‌లో పనిచేసే కార్మికులను ఆ పనులకు వినియోగించకుండా ఇతర పనులకు వినియోగించడం చర్చనీయాంశమైంది. కార్పొరేషన్ మేయర్, పలువురు అధికారపార్టీ కార్పొరేటర్లు, రాజకీయ నాయకుల ఇళ్లలో పదుల సంఖ్యలో పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. వారిని వారికి కేటాయించిన పనులకు తిరిగి రప్పించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.